క్లుప్తంగా

31న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ అత్యవసర సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఆదివారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వర్షం కోసం అక్కదేవతలకు పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లి: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని మండలంలోని శెట్టిపల్లెలో ఆదివారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఆనవాయితీగా అక్కదేవతలకు పూజలు చేస్తామని, ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా ఉండాలని అక్క దేవతలను ప్రార్థించినట్లు చెప్పారు.

ఈఆర్ కార్యాలయం పరిశీలన



కార్యాలయం పరిశీలిస్తున్న ఎస్ఈ


చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఆర్‌ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు)ను ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయ గదులను పరిశీలించారు. పెచ్చులూడిన పైకప్పు, వేలాడుతున్న విద్యుత్ తీగలను చూశారు. ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల నుంచి వినియోగదారులు కరెంటు బిల్లులు కట్టాలంటే ఈఆర్ కార్యాలయానికి వస్తారని తెలిపారు. నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్, ఈఆర్‌ఓ ఎస్ఏ గౌతమి పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూలో భారీగా చేరికలు

చిత్తూరు కార్పొరేషన్: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)లో ఆదివారం పలు సంఘాల నేతలు చేరారు. ముఖ్యంగా 40 ఏళ్లుగా జిల్లా కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన చైతన్య సైతం ఐఎఫ్‌టీయూలో చేరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జరిగిన చేరిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగ, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని తెలిపారు. ఐఎఫ్‌టీయూలో చేరిన వారిలో గుడిపాలలోని ఫుడ్ బేవరేజెస్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు అన్బు, కార్యదర్శి వెంకటేష్ కోశాధికారి రమేష్, ఐఓసీ ట్యాంకర్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అన్సర్, గ్రావిటా ఇండియా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి దినేష్, ఉపాధ్యక్షులు మైఖేల్, నవీన్, సహాయ కార్యదర్శి ప్రశాంత్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు క్యాజువల్ స్వీపర్స్ యూనియన్ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి రాము, మధ్యాహ్నం భోజనం కార్మిక యూనియన్ అధ్యక్షులు రూబీ సెల్వి, బుజ్జి, చింతపండు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, మున్నాతో పాటు దాదాపు 50 మంది ఉన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపునేని హరికృష్ణ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ప్యాక్‌హౌస్‌తో అధిక లాభాలు!

- కూరగాయల నిల్వ, గ్రేడింగ్‌లకు రైతులకు సౌకర్యం
- ప్యాక్‌హౌస్‌లోని సరుకుకు మార్కెట్‌లో మంచి ధరలు
- ఉద్యానశాఖ ద్వారా రైతులకు 50 శాతం రాయితీ



ప్యాక్‌హౌస్ నిర్మాణానికి ఇంజనీర్ ప్లాన్



వి.కోటలో రైతులు నిర్మించిన ప్యాక్‌హౌస్

పలమనేరు: ఆరుగాలం పండించిన పంట నాణ్యత లేకుంటే మార్కెట్‌లో ఆశించిన ధర పలకడం లేదు. మార్కెటింగ్ చేసే విధానంలో మెళకువలను పాటించకపోవడం రైతుకు నష్టాలకు ఓ కారణమవుతోంది. వీటి నివారణ కోసం ఉద్యానశాఖ ప్యాక్‌హౌస్ నిర్మాణాలను రైతులు చేపట్టేలా వారికి 50 శాతం రాయితీ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్యాక్‌హౌస్ వలన రైతులకు జరిగే మేలు, దీన్ని ఎలా పొందాలి, ఎవరిని సంప్రదించాలి వివరాలను పలమనేరు ఉద్యానశాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

ప్యాక్ హౌస్ ఎందుకంటే....

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను సరైన ధర లభించేలా నిల్వ ఉంచుకోవచ్చు. ఉద్యాన ఉత్పత్తులైన పండ్లు, పూలు, కూరగాయలను తాత్కాలికంగా నిల్వ చేసుకోవచ్చు. ఉత్పత్తులను శుభ్రం చేసుకోవడం, ప్యాకింగ్, గ్రేడింగ్ చేసుకుని పొలం నుంచి తాజాగా మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సరుకు నాణ్యత బాగుంటుంది.

ప్యాక్‌హౌస్ నిర్మాణం ఇలా...

- 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలి.
- పైకప్పును జీఐ ఐరెన్, సిమెంట్ రేకులు,లేదా కాంక్రీట్ నిర్మాణం చేయాలి
- సిమెంట్ ఫ్లోరింగ్, 8 కిటికీలు, 2వేల లీటర్ల వాటర్ ట్యాంకు ఉండాలి
- భవనానికి ఓ సాధారణ ద్వారం, మరో 8 అడుగుల షట్టర్ నిర్మించాలి
- ప్యాక్‌హౌస్‌లోపల కూరగాయలను శుభ్రం చేసేందుకు మూడు నీటితొట్టెలు, తడిని ఆర్పేందుకు మూడు ఫ్యాన్లు ఉండాలి.
- గ్రేడింగ్ టేబుళ్లు, తూకానికి 300 కేజీల ఈ-వేయిమెంట్ స్కేలు, ప్యాకింగ్‌కోసం 250 నంబర్ ప్లాస్టిక్ క్రేట్స్ తెచ్చుకోవాలి.
- అదనంగా ఓ ఇన్‌వర్టర్, కార్యాలయ టేబుల్, నాలుగు కుర్చీలు, టార్పాలిన్ షీట్ ఉండాలి.
- మామిడి రైతులకైతే తప్పనిసరిగా దేశాంపింగ్ యూనిట్ అమర్చుకోవాలి

50శాతం రైతుకు రాయితీ లభిస్తుంది..

ప్రభుత్వం సూచించిన మేర ప్యాక్‌హౌస్ నిర్మాణానికి రూ.4లక్షలు ఖర్చు అవుతుంది. ఇందులో 50 శాతం అంటే రూ.2లక్షలను ఉద్యానశాఖ రైతుకు అందిస్తుంది.

ఎవరిని సంప్రదించాలంటే....

ఆసక్తి ఉన్న రైతులు ప్యాక్‌హౌస్ నిర్మించుకోవాలంటే సంబంధిత ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఇంజనీరు ద్వారా ప్లాన్, ఎస్టిమేషన్ , భూమి పత్రాల జిరాక్సులు, రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతా జిరాక్స్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, వంద రూపాయల బాండుపేపర్, నోటరీ అఫిడవిట్ ఉంటే చాలు.

రైతులకు అధిక లాభాలు..



ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కూరగాయలకే అధిక ధర లభిస్తోంది. చాలామంది రైతులు పండించిన పంటలను నాణ్యతను పాటించక మార్కెట్‌కు తీసుకెళుతున్నారు. దీంతో ధర తగ్గుతోంది. అందుకే ప్యాక్‌హౌస్‌లు నిర్మించుకుంటే సరుకు నాణ్యంగా మారుతుంది. రైతులు పండించిన పంట కాకుండా ఇతర రైతులు పంటలను ప్యాక్‌హౌస్‌లో ప్యాకింగ్ చేయడం ద్వారా రైతుకు అదనపు ఆదాయం దక్కుతుంది.

–మధుసూదన్‌రెడ్డి, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

ప్యాక్‌హౌస్‌పై మరింత అవగాహన అవసరం..



ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న ప్యాక్‌హౌస్ పథకం రైతులకు వరం లాంటిదే. అన్ని ఉన్నా బ్యాంకులో రైతులకు రుణాలు పుట్టడం లేదు. బాగా డబ్బులున్న వారికే రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు మొగ్గుచూపుతున్నారు. దీనిపై కొంత ఉపశమనం దొరికితే రైతులు వీటిని నిర్మించుకొనేందుకు తప్పకుండా ముందుకొస్తారు. ఇది మంచి పథకమే కానీ అవసరమైన రైతులకు దక్కాలి.

–పుష్పరాజ్, రైతు, ముసలిమొడుగు, పలమనేరు మండలం

మున్సిపల్ సమావేశాలు జరపరా?



కుప్పం మున్సిపల్ కార్యాలయం

- ఏడు నెలలుగా జరగని కౌన్సిల్ మీటింగ్
- సమీక్షలకు ఫుల్‌స్టాప్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

కుప్పం: ప్రతి నెలకొకసారి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మున్సిపాలిటీ అభివృద్ధి, పాలన జరగాల్సిన సమీక్ష ఏడు నెలలుగా జరగలేదు. దీంతో కుప్పం మున్సిపాలిటీ పాలన అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య పనులు నుంచి, జనన, మరణ సర్టిఫికెట్లతో పాటు అన్ని రకాలు ధ్రువీకరణ ప్రతాలు పొందాలంటే సామాన్యులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం..

ఏడు నెలలుగా జరగని సమావేశం

జనవరి 12వ తేదీ చివరగా కుప్పం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం నిర్వాహించారు. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లో ఉందని సమావేశాన్ని వాయిదా వేశారు. తరువాత మారిన రాజకీయపరిణామాలతో మున్సిపాలిటీ పాలన వ్యవస్థను అధికారులు విస్మరించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆపేశారు. దీంతోపాటు సామాన్య ప్రజలకు అందాల్సిన సేవలను పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం ఉన్న పాలక వర్గం రాజకీయాలకు అనుగుణంగా అధికార పార్టీ నేతలు వద్దకు చేరే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి తగ్గట్టుగా అధికారులు సైతం మున్సిపాలిటీ వ్యవహారాలను పట్టించుకోవడం లేదు. రెండు నెలలుగా మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కనెక్షన్, పారిశుధ్య పనులు, సర్టిఫికెట్ల కోసం ప్రజలు మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం..

కుప్పం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని గత 15 రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమంలో ఆయనకు కుప్పం మున్సిపాలిటీ పరిస్థితిని వివరించారు. కానీ స్పందన లేకపోవడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. వారం రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరావు బదలీ అయ్యారు. ప్రస్తుతం నూతన కమిషనర్‌గా శ్రీనివాసులురావు బాధ్యతలు స్వీకరించినా మున్సిపాలిటీ పాలనపై చర్యలు లేవు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి కుప్పం మున్సిపాలిటీ పాలనను గాడిలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

2న ఉచిత కేన్సర్ వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న బీఎంఎస్ క్లబ్‌లో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదివారం క్లబ్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శివ మాట్లాడుతూ ఎస్‌వీఐసీసీఏఆర్ టాటా కంపెనీ తిరుపతి వారి సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కేన్సర్ లక్షణాలను గుర్తించేందుకు శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కేన్సర్ లక్షణాలు కలిగిన వారు వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వైద్యపరీక్షలతో పాటు చికిత్స కూడా ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముత్తుమారెమ్మ ఆలయ నూతన కమిటీ ఎంపిక



కానుకలను లెక్కిస్తున్న సభ్యులు

కుప్పం: పట్టణంలోని శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ముత్తుమారెమ్మ జాతర నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడిగా హర్ష, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ (నాను), ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, సంయుక్త కార్యదర్శిగా ప్రతాప్, కోశాధికారిగా రమేష్, సహాయ కోశాధికారిగా ప్రమోద్, వీరితో పాటు 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో భాగంగా అమ్మ వారి హుండీ లెక్కింపును కమిటీ సభ్యులు, మాజీ కమిటీ సభ్యులు, లెక్కించారు. లెక్కింపులో భక్తుల కానుకల ద్వారా అమ్మవారికి రూ.3 లక్షల 31 వేల 930 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలని సభ్యులు తీర్మానించారు.

వెండి ఆభరణాల బహూకరణ



అర్చకులకు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

పుంగనూరు: పట్టణంలోని నగరి వీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి ఆభరణాలు బహూకరించారు. ఆదివారం పట్టణానికి చెందిన స్వీట్‌స్టాల్ యజమాని రెడ్డిప్రసాద్, రమేష్ కలసి రెండు కిలోల బరువు గల వెండి కిరీటాలు, ముఖావలి ఆభరణాలు స్వామివారికి బహూకరించారు. ఈ ఆభరణాలను ఆలయ అర్చకులు విశ్వేశ్వరయ్య, సోమేశ్వరయ్య, నాగేంద్ర, ప్రదీప్‌లకు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అశ్వర్థనారాయణ జెట్టి, మునస్వామి మొదలియార్, నాగరాజ, కుట్టి, రఘు పాల్గొన్నారు.




భారీ క్రేన్ల సాయంతో గడ్డర్లు అమరుస్తున్న దృశ్యం

ఫ్లైఓవర్‌కు గడ్డర్లు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కలెక్టరేట్ వద్ద సాగుతున్న చెన్నై–బెంగళూరు హైవే పనుల్లో భాగంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌కు ఆదివారం గడ్డర్లు ఏర్పాటు చేశారు. వంతెనపై వాటిని అమరుస్తున్న సమయంలో ట్రాఫిక్‌ను పోలీసులు కాసేపు క్రమబద్ధీకరించారు.

ఆడికృత్తికకు ఏర్పాట్లు పూర్తి





దాసార్లపల్లి వద్ద సుబ్రహ్మణ్యస్వామి, కల్యాణం చేస్తున్న అర్చకులు, స్వామి వారికి ఊంజలసేవ



కావళ్లు చెల్లించుకుంటున్న భక్తులు

వి.కోట: సోమ, మంగళవారాలు భరణి, కత్తిక సందర్భంగా మండలంలోని అన్ని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కావళ్ల చెల్లింపులు వైభవంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని దాసార్లపల్లి వద్ద వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నేడు పత్తి అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మండలంలోని ఆళ్వారుపల్లి క్రాస్, నాయకనేరి వద్ద దుర్గంకొండపై వెలసిన శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం భరణి కావళ్లు ఉంటాయని భక్తులు విచ్చేసి కావళ్లు చెల్లింపులు నిర్వహించవచ్చని తెలిపారు. అలాగే మంగళవారం ఆడికృత్తిక కావళ్లు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఆలయాల్లోనూ భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు

పుంగనూరు: మండలంలోని నెక్కుంది వద్ద గల శ్రీఅగస్తీశ్వరస్వామి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై భరణి కావళ్లు చెల్లింపులతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అన్నప్రసాదం వితరణ చేశారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

సదుం: మండల కేంద్రంలో గార్గేయ నదీ తీరాన వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

ఆడికృత్తికకు సర్వం సిద్ధం

గుడుపల్లె: గుడివంక ఆలయంలో సోమవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈమేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆదివారం ఆలయంలో వేల్‌మురుగా అంటూ కావళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా గుడివంక గంగాధరేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఊంజలసేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆడికృత్తిక సందర్భంగా కుప్పం నుంచి గుడివంక ఆలయానికి 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

కమనీయం.. షణ్ముఖస్వామి కల్యాణం

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అంతకుముందు ఉదయం స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు.

భరణి కావళ్ల చెల్లింపు..

పురవీధుల్లో భరణి కావళ్లు చెల్లిస్తున్న భక్తులు ఊరేగింపుగా హరోహరా అంటూ ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించారు.

పదివేలు కట్టు..రోజుకు వెయ్యి పట్టు!

- పలమనేరులో డబ్బులు పోగొట్టుకుంటున్న జనం
- రకరకాల ఎర్నింగ్‌యాప్‌లతో మోసాలు
- అప్పులపాలై కనిపించకుండా పోతున్న యువకులు
- డాయ్ యాప్ కాదు మరెన్నో యాప్‌లతో మోసాలు



ఆన్‌లైన్ యాప్

పలమనేరు: పదివేలు ఆన్‌లైన్‌లో డిపాజిట్ చేస్తే మన డబ్బు మనకిస్తూ రోజుకు వెయ్యి సంపాదించవచ్చునేనే దురాశ దుఃఖానికి చేటులా మారింది. సులభంగా డబ్బులు సంపాదించవచ్చునే దురాశతో జిల్లాలో పలువురు వేలకువేలు పోగొట్టుకుని మదనపడుతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో కనిపించే ఈజీ ఎర్నింగ్‌యాప్‌లో మోసాలకు పాల్పడే యాప్‌లపై అవగాహన లేని అమాయకులు, చదువుకున్న వారు సైతం డబ్బులు పోగొట్టుకుని తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే డాయ్ యాప్ కాకుండా ఇతర యాప్‌లోనూ వేలాదిమంది ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఇదిగో సాక్ష్యం...

పట్టణంలోని బోయవీధికి చెందిన ఖాదర్ ఓఎంజీ యాప్‌లో పదివేలను కడితే రోజుకు వెయ్యి వస్తుందని తన స్నేహితుడు చెబితే నమ్మి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పర్మిషన్లను ఇచ్చి తన ఫోన్ పే నుంచి వెయ్యి రూపాయలను యాప్ ఖాతాకు జమచేశాడు. దీంతో యాప్‌లో 24 గంటల సమయం కౌంట్ మొదలైంది. అతను డబ్బులు చెల్లించిన 24 గంటలకు అతని ఖాతాలోకి రూ.100 జమ అయ్యింది. మళ్లీ రెండో రోజుకి వంద వచ్చింది. దీంతో రూ.10వేలను జమ చేశాడు. 24 గంటల్లో మరో వెయ్యి వచ్చింది. ఆతర్వాత విత్‌డ్రా ఆప్షన్ ప్రాసెసింగ్ అని డబ్బు రాలేదు. గతవారం రోజులుగా ప్రాసెసింగ్‌లోనే ఉంది. దీంతో వడ్డీకి ఆశపడి డబ్బును పోగొట్టుకున్నాడు. ఇలాగా నమ్మి వేలాదిమంది డబ్బు భారీగా పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది.

కనిపించని యువకులు..

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన ఓ యువకుడు అక్కడి వైన్ షాపులో సూపర్‌వైజర్. బెట్స్‌లూప్ అనే ఆన్‌లైన్ క్రికెట్ యాప్‌కు అలవాటు పడి లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ యువకుడు కనిపించకుండా పోయాడని తెలుస్తోంది. ఇదేవిధంగా జిల్లాలో కొందరు యువకులు లక్షల్లో ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయలు ఇప్పటికే బెట్టింగ్‌యాప్‌లో కొంప మునిగినట్టు సమాచారం.

దీనికితోడు ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు..

ఆధార్‌కార్డుతో రుణాలిస్తామంటూ పదుల సంఖ్యలో ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు స్మార్ట్‌ఫోన్‌లో దర్శనమిస్తున్నాయి. వీటిని ఇన్‌స్టాల్ చేసి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను ఇస్తే నిమిషాల్లో రూ.5 వేల నుంచి రూ.10వేల దాకా రుణం మంజూరై మన ఖాతాల్లోకి చేరుతుంది. ఇందులో వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజు పేరిట రూ.5వేలకు రూ.1500, రూ.10వేలకు రూ.3వేలు పట్టుకుని ఇస్తున్నారు. తీసుకున్న రుణాన్ని వారంలో తీర్చాల్సి ఉంటుంది. దీన్ని తీర్చలేక ఇబ్బందిగా ఉంటే అదే యాప్‌లో మరిన్ని యాప్ యాడ్‌లు కనిపిస్తుంటాయి. పాత లోన్ కోసం మరో యాప్‌లో కొత్తలోన్ తీసుకుని పాతలోన్ తీర్చడం ఇలా నాలుగైదు లోన్లను తీసుకుని వాటిని కట్టేందుకు మళ్లీ అప్పులు చేసి ఇక్కట్లు పడుతున్నవారు ఈ ప్రాంతంలో చాలామంది కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు, దినసరి పనులు చేసుకునే కూలీలు, మాల్స్‌లో పనిచేసేవారు, విద్యార్థులు ఎక్కువగా ఆన్‌లైన్ లోన్ల బారిన పడుతున్నారు.

వందల సంఖ్యలో ఇలాంటి యాప్‌లు...

స్మార్ట్‌ఫోన్ ప్లేస్టోర్‌లోకి వెళితే ఓఎంజీ, గెట్‌క్యాష్, ఈజీ క్యాష్, ఈజీలోన్, మినిట్‌లోన్, డబుల్, స్పిన్‌టు విన్‌మనీ, బెట్స్‌లూప్ లాంటి ఎర్నింగ్, లోనింగ్ యాప్‌లు వందల్లో దర్శనమిస్తుంటాయి.



బెట్స్ యాప్‌లో లైవ్ గ్యాంబ్లింగ్

కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఫేక్ ఐడీల ద్వారా ఇలాంటి యాప్‌లను ప్లేస్టోర్‌లో ఉంచినట్టు తెలుస్తోంది. ఇందులోని యాప్‌లో ఏది అసలైందో ఏది నకిలీనో తెలియక సులభంగా డబ్బు సంపాదించవచ్చునని జనం మొదటికే మోసపోతున్నారు.

మా వీధిలో పదిమంది దాకా ఉన్నారు..



ముందు 5వేలు మళ్లీ 10వేలు ఇలా లోన్లు కట్టేకొద్దీ లోన్ అమౌంట్ పెరుగుతుంటుంది. దీని కోసం ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరు నాలుగైదు లోన్లు తీసి వాటిని కట్టలేక ఇబ్బంది పడేవాళ్లు మా వీధిలో పదిమందిదాకా ఉన్నారు. ఒక్కసారి ఈ లోన్ల కూపిలోకి దిగితే మళ్లీ అంతే సంగతులు. కొందరు అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ అప్పు కడుతున్నారు.

–ముజ్జు, బోయవీధి, పలమనేరు

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



ఆన్‌లైన్‌లో రకరకాల మోసాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. చాలామంది స్మార్ట్‌ఫోన్‌ను కెలుకుతూ ఇలాంటి యాప్‌లతో మోసపోతుంటారు. అమాయకులే కాదు చదువుకున్న విద్యార్థులు సైతం మోసపోతున్నారు. ఇలాంటి వాటిని నమ్మరాదని చెబుతూనే ఉన్నాం. అయినా దురాశకు వెళ్లి మోసపోయి బాధపడితే ఏం లాభం. ప్రజలు ఇలాంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలి.

–చంద్రశేఖర్, సీఐ, పలమనేరు